www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 23 ఏప్రిల్ 2024

8 పేజీలు

ఏలూరు పశ్చిమ గోదావరి



మనస్వి

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ మనమ్మాయే

- 'పది' ఫలితాల్లో బాలికలదే హవా
- పశ్చిమలో 81.82 శాతం ఉత్తీర్ణత
- ఏలూరు జిల్లాలో 80.08 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రస్థాయిలో పశ్చిమకు 23, ఏలూరుకు 25వ స్థానం

పదో తరగతి ఫలితాల్లో స్టేట్ ఫస్టు ర్యాంకు మన విద్యార్థినికే దక్కింది. ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన ఆకుల వెంకట సాయి నాగ మనస్వి హిందీలో మినహా మిగిలిన అన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు సాధించి రికార్డు సృష్టించింది. మనస్వి తల్లిదండ్రులు నాగవరప్రసాద్, శైలజ వృత్తి రీత్యా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కావడం విశేషం. ప్రసాద్ నూజివీడు మండలం అన్నవరంలోనూ, శైలజ చాట్రాయి మండలం సోమవరంలో పని చేస్తున్నారు. మనస్వి నూజివీడులోని నారాయణ విద్యాసంస్థలో పదో తరగతి చదివింది. ..6లో

నామినేషన్లకే ఇంత ఖర్చా..!

ర్యాలీ పేరిట భారీగా జనం తరలింపు

ఒక్కొక్కరికి రూ 500, పెట్రోల్‌కు మరో రూ.200 చొప్పున పంపకం

అభ్యర్థుల ఎన్నికల ఖర్చు లెక్కింపుపై అధికారుల మీనమేషాలు

పట్టించుకోని ఎన్నికల వ్యయ కమిటీ

ప్రజాశక్తి - భీమవరం

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలని ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినప్పటికీ అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. వీటిని నివారించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఒక్కొక్కరికి రూ.500, మోటార్ సైకిల్‌లో పెట్రోల్‌కు మరో రూ.200, ఇద్దరు కలిసి ఒకే మోటార్ సైకిల్‌పై వస్తే రూ.వెయ్యితోపాటు అదనంగా రూ.200 పెట్రోల్ నిమిత్తం అందిస్తున్నారు. కేవలం నామినేషన్లకే ఇంత భారీ మొత్తంలో డబ్బు పంపకం చేస్తున్నా ఎన్నికల వ్యయ కమిటీ పట్టించుకోవట్లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరులో భారీ ర్యాలీ

సార్వత్రిక ఎన్నికల ఘట్టం ప్రారంభమై నెల రోజులు దాటింది. ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీ వరకు కొనసాగనుంది. తర్వాత నామినేషన్ల ఉపసంహరణ, విత్‌డ్రా ప్రక్రియకు ఈ నెల 29 వరకు సమయం ఉంది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాలకు ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయి. అధికార పార్టీ వైసిపితోపాటు, బిజెపి, జనసేన, టిడిపి కూటమి, ఇండియా వేదిక అభ్యర్థులను ఒకటి, రెండు మినహా అన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించారు. ఇప్పటికే ఆయా పార్టీలు అభ్యర్థులకు బి-ఫారాలు అందించాయి. ఇప్పటికే ఇండియా వేదిక అభ్యర్థులతోపాటు ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియకు ఇంకా మూడు రోజుల సమయం మాత్రమే ఉండడంతో నామినేషన్లు జోరందుకున్నాయి. వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా భారీగా జన సమీకరణ చేస్తున్నారు. అధికార పార్టీతోపాటు మిగిలిన పార్టీలు కూడా జనాలను భారీగా తరలిస్తున్నారు. నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు బల ప్రదర్శన చేస్తుండటంతో నువ్వా..నేనా అన్నట్లుగా జన సమీకరణలు జరుగుతున్నాయి. ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థి అని తారతమ్యం లేకుండా జనాలను భారీగా తరలిస్తున్నారు. జన సమీకరణ, జనాల తరలింపునకు గ్రామాలు, బూత్‌లు వారీగా నాయకులను అప్పగిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అయితే పోలింగ్ బూత్‌కు ఒకరిని చొప్పున నియమించి నెలకు ఇంతిస్తామని ఒప్పందం కుదుర్చుకుని వారికి అడ్వాన్స్ కూడా చెల్లించారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు ప్రధానంగా డబ్బుతోనే సాగుతున్న పరిస్థితి ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి అభ్యర్థులు డబ్బు భారీగా ఖర్చు చేస్తున్న పరిస్థితి ఉంది. ఆత్మీయ ..6లో

పవన్ పర్యటన వాయిదా

తాడేపల్లిగూడెం, గణపవరం సభలు అర్థాంతరంగా రద్దు

చివరి నిమిషంలో వెల్లడితో కార్యకర్తల్లో అసహనం

ఉదయం నుంచి తాడేపల్లిగూడెంలో ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజల అవస్థలు

ఎండలో మలమలమాడిన పోలీసులు, జనసైనికులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, తాడేపల్లిగూడెం, గణపవరం

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం రెండో రోజు పర్యటన అర్థాంతరంగా రద్దయ్యింది. సాయంత్రం నాలుగు గంటలకు తాడేపల్లిగూడెంలో, రాత్రి ఏడు గంటలకు గణపవరంలో బహిరంగ సభలు ఉంటాయని జనసేన నాయకులు తెలిపారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం కారణంగా సభలను రద్దు చేస్తున్నట్లు జనసేన నాయకత్వం తెలిపింది. దీంతో ఉదయం నుంచి ఎండలో ఉండి పవన్‌కల్యాణ్ కోసం ఎదురుచూసిన అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసహనం నెలకొంది. పవన్ కల్యాణ్ వస్తారని వేలాది మంది కార్యకర్తలు తాడేపల్లిగూడెం బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అదే క్రమంలో తాడేపల్లిగూడెం ..6లో

నాలుగో రోజు 36 నామినేషన్లు

- ఏలూరు జిల్లాలో 23, పశ్చిమలో 13
- ప్రధాన పార్టీ అభ్యర్థుల ర్యాలీల హోరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నాలుగో రోజు నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగింది. సోమవారం మొత్తం 36 నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు జిల్లాలో ఐదు నామినేషన్లు ఏలూరు ఎంపీ స్థానానికి, 18 నామినేషన్లు ఎంఎల్ఎ స్థానాలకు వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం ఎంపీ స్థానానికి ఒకటి, ఆరు ఎంఎల్ఎ స్థానాలకు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మాత్రం సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఏలూరు టిడిపి ఎంపీ అభ్యర్థిగా పుట్టా మహేష్ యాదవ్, చింతలపూడి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా సొంగా రోషన్‌కుమార్, కైకలూరు వైసిపి అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు, నూజివీడు టిడిపి అభ్యర్థిగా కొలుసు పార్థసారధి, దెందులూరులో చింతమనేని ప్రభాకర్, నరసాపురం జనసేన అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్, ఉండి టిడిపి అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజుతోపాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవ్వగా, ఆదివారం సెలవు కావడంతో ఇప్పటి వరకూ నాలుగు రోజులపాటు నామినేషన్ల ప్రక్రియ ..6లో



ఉండిలో నామినేషన్ వేస్తున్న రఘురామకృష్ణంరాజు

మెట్ట, డెల్టా, ఏజెన్సీల సమ్మేళనం.. ఏలూరు

మధ్యపేజీల్లో..

హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకోవాలి

ఆటో డ్రైవర్ కుమార్తె మండల ఫస్ట్

8లో..

20 రోజులు పరీక్షా కాలం

- బ్యాంకుల్లో లావాదేవీలపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

ప్రజాశక్తి - ఏలూరు

బ్యాంకుల్లో అధిక మొత్తంలో జరిగే నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై నిఘా ఉంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనానిగమ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో వివిధ ఎన్నికల విభాగాల నోడల్ అధికారులు, వ్యయ పరిశీలకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నీనా నిగమ్ మాట్లాడుతూ ముఖ్యంగా బ్యాంకుల్లో అధిక నగదు మొత్తాల లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా యంత్రాంగమంతా అప్రమత్తంగా పని చేస్తున్నప్పటికీ మరింత నిఘా అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఏదైనా నగదు, ఇతర వస్తువులు పట్టుబడినప్పుడు అందుకు సంబందించిన దర్యాప్తు వేగవంతంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. పోస్టల్ ఆర్డర్లు, యుపిఐ పేమెంట్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. మద్యం రవాణా సమయంలో సక్రమమైన సమయంలో చేరాల్సిన చోటుకు చేరిందా లేదా అనేది పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి, మే, 13న నిర్వహించే సాధారణ ఎన్నికలు సజావుగా, ..6లో

మాట్లాడుతున్న నీనా నిగమ్

సత్తా చాటిన గిరిజన విద్యార్థులు

బుట్టాయగూడెం: పదవ తరగతి ఫలితాలలో మండలంలోని బుట్టాయగూడెం విద్యా రోహిణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కోసూరి శృతి 573 మార్కులు, గొడుగు మనోజ్ కుమార్ 567 మార్కులతో మండలంలో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు కలిపి 17 పాఠశాలల విద్యార్థుల పదో తరగతి పరీక్షలు రాయగా ప్రయివేటు విద్యాసంస్థలు విద్యా రోహిణి ఇంగ్లీష్ మీడియం, సెయింట్ జోసఫ్ ప్రైమరీ అండ్ హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం పందిరి మామిడిగూడెం పాఠశాలలు 100 శాతం, ప్రభుత్వ పాఠశాల, గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాల లంకలపల్లి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 661 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 521 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణతా శాతం 78 శాతం బాలికలు 79 శాతం, మండలం మొత్తంగా 78.8 శాతం సాధించారని ఎంఇఒ తెల్లం బాబూరావు తెలిపారు.

జెడ్‌పి పాఠశాలల్లో 65 శాతం ఉత్తీర్ణత

కలిదిండి: మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 65 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. పెదలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 63.8 శాతం, భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 78.1 శాతం, చిన తాడినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 56 శాతం, గుర్వాయి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 72 శాతం, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 60.5 శాతం, కొండంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 79.2 శాతం, తాడినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 35 శాతం, ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 62.7 శాతం, కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 76.8 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. మొత్తం 576 మంది విద్యార్థులకు గాను 403 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎడివిఎల్ నరసింహా 554 మార్కులతో ప్రథమ స్థానంలోనూ, భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.బాలాజీ 549 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. వి.సిరి 548, బత్తిన ఏసు ప్రియ 506, వై.జగదీష్ 539, ఎన్.భవాని 539 మార్కులతో 500 పైగా సాధించిన సత్తా చాటారన్నారు.

క్రాంతి హై స్కూల్ విద్యార్థుల విజయ ప్రభంజనం

మండలంలోని కోరుకొల్లు క్రాంతి హైస్కూల్ విద్యార్థులు విజయ ప్రభంజనం సృష్టించారని కరెస్పాండెంట్ చన్నంశెట్టి కృష్ణ, ప్రిన్సిపల్ చన్నంశెట్టి అజేష్ బాబు తెలిపారు. తంగెళ్ల బిందుమాధవి 557 మార్కులతో ప్రథమ, మారుబోయిన సౌజన్య 521 మార్కులతో ద్వితీయ, 515 మార్కులతో ఆముదాలపల్లి శ్రీరామ్ తృతీయ స్థానాలలో నిలిచి, క్రాంతి హై స్కూల్‌లో మొదంజలో నిలిచారన్నారు. అత్యుత్తమ ఫలితాలతో పాటు అత్యధిక మార్కులు సాధించడంలో కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కరస్పాండెంట్ చన్నంశెట్టి కృష్ణ, ప్రిన్సిపల్ చన్నంశెట్టి అజేష్ బాబు తెలిపారు.

కైకరం టాపర్‌గా శానం నందిని ప్రియ

ఉంగుటూరు: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కైకరం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని శానం నందిని ప్రియ 587 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం సాధించింది. మొత్తం 118 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 66 మంది ఉత్తీర్ణత సాధించారు. 587 మార్కులతో శానం నందిని ప్రియ, 574 మార్కులతో పి.జస్వంత్ కార్తీక్ 552 మార్కులతో ఎన్.కుసుమ్‌తో మొదటి, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారని ఆ పాఠశాల ఉపాధ్యాయులు వెల్లడించారు.

ఉషోదయ హైస్కూల్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

నారాయణపురం ఉషోదయ ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిందని ప్రిన్సిపల్ గుణ్ణం బుల్లెబ్బాయి వెల్లడించారు. 34 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 33 ఫస్ట్ క్లాసులు, ఒక సెకండ్ క్లాసులతో నూరు శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎ.నర్మశ్రీ 581 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. కె.శిరీష 580, కె.లక్ష్మీచరణ్ 576, వి.నిశాంత్ 548 మార్కులతో విజేతలుగా నిలిచారు.

గురుకుల విద్యార్థుల విజయఢంకా

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గురుకుల పాఠశాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు విజయఢంకా మోగించారు. గురుకుల పాఠశాల్లో మొత్తం 79 విద్యార్థులకు 77 మంది ప్రథమ స్థానం సాధించి, ఇద్దరు ద్వితీయ స్థానం సాధించగా, చిట్టి పావని 577 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిల్చింది. కె.హాసిని 572, జి.వెన్నెల 570 మార్కులు సాధించారు. వేల్పుచర్ల హైస్కూల్ విద్యార్థులు 42 మందికి 33 మంది పాసై 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ స్థానం డిఎస్‌వి.సాయి 574 మార్కులు సాధించారు. గోపవరం హైస్కూల్ విద్యార్థులు 77 మందికి 59 మంది పాసవ్వగా, ప్రథమ స్థానం దేవరపల్లి సంజన 562 మార్కులు సాధించారు. రమణక్కపేట హైస్కూల్‌లో 57 మందికి గాను 43 మంది పాసై రంగు తేజసాయి 574 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. చక్కపల్లి హైస్కూల్‌లో 85 మందికి 66 మంది పాసయ్యారు. పి.చరణ్‌తేజ 501 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కాట్రేనిపాడు హైస్కూల్‌లో 25 మందికి 22 మంది పాసయ్యారు. పేరిచర్ల రంజని 512 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిల్చింది. గుడిపాడు హై స్కూల్‌లో 25 మందికి 20 మంది పాసై 80 శాతం విజయం సాధించారు. నూర్ భాషా ఫిరజ్ 503 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిల్చింది. మండల కేంద్రమైన ముసునూరు హైస్కూల్‌లో 115 మందికి 66 మంది పాసై, 57 శాతం మాత్రమే విజయం సాధించగా, మండలంలో పదో తరగతిలో ఎక్కువ మంది తప్పిన పాఠశాల ముసునూరు ప్రభుత్వ పాఠశాలని చెప్పవచ్చు. పది ఫలితాల్లో ముసునూరు వెనుకంజలో వుంది. ముసునూరు గురుకుల పాఠశాల నూటికి నూరు శాతం పాసై ప్రథమ స్థానంలో నిల్చింది.

గతం కంటే మెరుగైన ఫలితాలు

కొయ్యలగూడెం: మండలంలో ప్రభుత్వ, ప్రయివేట్ యాజమాన్యాలలో 15 పాఠశాలల నుంచి 407 మంది బాలురు, 392 మంది బాలికలు మొత్తంగా 799 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వీరిలో 288 మంది బాలురు 70.76 శాతం, 318 మంది బాలికలు 81.12 శాతం మొత్తంగా 606 మంది 75.84 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ, ప్రయివేట్ యాజమాన్యంలోని పాఠశాలల్లో మండల స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఎమ్.నాగ లోహిత వెంకట స్వామి 588 ఎమ్‌వివిఆర్ విద్యానికేతన్ సరిపల్లి, కె.సుష్మ 587 సాయి రాకేష్ బ్రిలియంట్ హై స్కూల్ గవరవరం, ఎన్.పావని దుర్గ 576 జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ బయ్యనగూడెం ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులు ఎన్.పావని దుర్గ 576 జడ్‌పిహెచ్‌ఎస్ బయ్యనగూడెం, ఎస్‌డి.నఫ్రున్నీసా 566 జడ్‌పిహెచ్‌ఎస్ రాజవరం, వి.వర్షిణి 559 జడ్‌పిహెచ్‌ఎస్ కన్నాపురం ఉత్తీర్ణత సాధించారు. గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

విద్యానికేతన్ విజయభేరి

మండలంలోని సరిపల్లి గ్రామంలో ఉన్న ఎంవిఆర్ విద్యానికేతన్ విద్యార్థులు విజయభేరి మోగించారని విద్యానికేతన్ ప్రిన్సిపల్ కె.రవి మహేష్ ఆనందం వ్యక్తం చేశారు. 588 మార్కులతో మద్దు జీవన సాయిశ్రీ మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. 584 మార్కులతో మెట్టా నాగ లోహిత్ వెంకట స్వామి మండలం తృతీయ స్థానంలో నిలిచాడు. 581 మార్కులతో దోరేపల్లి అలేఖ్య పాఠశాల తృతీయ స్థానం, కొయ్యలగూడెం మండలం నాల్గవ స్థానం సాధించింది. 580 మార్కులతో అడపా సత్య శ్రీ, కర్రెద్ద యశ్వంత్ గుణశేఖర్ పాఠశాల నాల్గవ, మండలం ఐదవ స్థానం సాధించారు.

రాకేష్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల ప్రతిభ

గవరవరం గ్రామంలో ఉన్న సాయి రాకేష్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ప్రతిభ చాటారు. వి.పూజితశ్రీ 587, కె.సుష్మ 580, ఆర్‌ఎన్‌వి చరణ్ 575 స్పెషల్ కేటగిరి స్టూడెంట్ రాజనాల బాబు 448 వచ్చాయని నరసింహ రాజు తెలిపారు.

గురుకుల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగన్నాథమ్

సోమవారం వెలువడిన పదోతరగతి ఫలితాల్లో మండలంలోని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కాగా 72 మంది విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా తిరుమిల్లి జగన్నాథమ్ 584 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా మండలంలోని మక్కినవారిగూడెం హైస్కూల్ విద్యార్థిని ఎన్.జ్యోతిక 578 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మండలంలో పదో తరగతి ఫలితాల్లో మొత్తం 433 మంది విద్యార్థులకు 373 విద్యార్థులు ఉత్తీర్ణత 86 శాతం సాధించారని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి తెలిపారు. టి.నరసాపురం హైస్కూల్ విద్యార్థులు 116 మందికి 98 మంది 85 శాతం, బొర్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు 120 మందికి 91 మంది 76 శాతం, మక్కినవారిగూడెం హైస్కూల్ విద్యార్థులు 44 మందికి 38 మంది 86 శాతం, కేతవరం హైస్కూల్ విద్యార్థులు 25 మందికి 33 మంది 88 శాతం, మర్రిగూడెం ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలో 38 మందికి 34 మంది 89 శాతం, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో 72 మంది 100 శాతం, బొర్రంపాలెంలోని జివిఆర్ ప్రయివేటు పాఠశాలల్లో 18 మందికి 100 శాతం విద్యార్థులు పాస్ అయ్యారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంఇఒతో పాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మండల ప్రథమ స్థానం సాధించిన 'ఇండో-సాక్సన్'

ముదినేపల్లి: ముదినేపల్లిలోని ఇండో-సాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థి కాగిత ఈశ్వర్ చరణ్ తేజ్ 588 మార్కులు సాధించి ముదినేపల్లి మండలంలోని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించాడు. ఈ పాఠశాల నుంచి 23 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో సగంపైగా విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మండల ప్రథమ స్థానం సాధించిన కాగిత ఈశ్వర్ చరణ్ తేజ్‌ను కరెస్పాండెంట్ జార్జి మట్టతిల్, స్కూల్ ప్రిన్సిపల్ సాలీ మట్టతిల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

'సహాయమాత' నూరు శాతం ఉత్తీర్ణత

ముదినేపల్లిలోని సహాయమాత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల నుంచి 55 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అంతా ఉత్తీర్ణత సాధించారు. వీరిలో సగం పైబడి విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారు. వీరిలో పి.లాస్య 581 మార్కులు సాధించి మండలంలోని ప్రయివేట్ స్కూళ్లలో ద్వితీయ స్థానం సాధించింది. ఎం.విగ్నేష్ 580, వై.హర్షిత్ 579, ఎల్.దుర్గా ప్రసాద్ 578, జి.రేవతి దుర్గ 578 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ సిస్టర్ లిన్సా, కరెస్పాండెంట్ సిస్టర్ క్రిష్టి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినుల ప్రతిభ

ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తామేమి తక్కువ కాదంటూ పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి మండల ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారు. మండలంలోని వడాలి జడ్పీ హైస్కూల్ విద్యార్థినిలు మండల ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారు. ఈ స్కూలుకు చెందిన పి. దీక్షిత 583 మార్కులు, బి.సుష్మ582 మార్కులు సాధించి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఒకే స్కూల్ కి చెందిన ఇద్దరు విద్యార్థినులు మండల ప్రథమ, ద్వితీయ స్థానం సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ముదినేపల్లి జడ్పీ హైస్కూల్ కి చెందిన విద్యార్థి హేమ రేవంత్ 578 మార్కులతో మండలంలో మూడో స్థానంలో నిలిచాడు. ద్వితీయ, తతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

233 మంది విద్యార్థుల ఉత్తీర్ణత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో మండలం వ్యాప్తంగా 367 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 233 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ కె.శ్రీనివాస్ తెలిపారు. వీరిలో బాలురు 126, బాలికలు 107 మంది ఉత్తీర్ణత పొందగా మండలం మొత్తం మీద 63 శాతం మంది ఉత్తీర్ణత పొందారని ఆయన అన్నారు. 134 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు తెలిపారు. ఇందులో జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.నవ్యశ్రీలక్ష్మీ 549 మార్కులతో ప్రథమస్థానం సాధించగా కామయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.వర్షిత 529 మార్కులతో ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు.

'పది' ఫలితాల్లో బాలికల హవా

ప్రజాశక్తి - చింతలపూడి

పదవ తరగతి ఫలితాలలో మండలంలో బాలికల హవా కొనసాగింది. చింతలపూడి ప్రభుత్వం పాఠశాలలో గతంలో పోల్చుకుంటే ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత సంవత్సరం 50 శాతం ఉత్తీర్ణ శాతం ఉండగా, ఇప్పుడు 77.69 శాతం ఉత్తీర్ణత సాధించారు. చింతలపూడి నాగిరెడ్డిగూడెనికి చెందిన ఎపిఆర్ఎస్ గర్ల్స్ స్కూల్‌లో ఎం.అనురాధ 584, కె.హని 584, ఎస్.తేజస్విని 582, చింతలపూడి సుబ్బరాజు హైస్కూల్ పాఠశాలకు చెందిన కె.మహిత 571 మార్కులు సాధించారు.

ద్వారకా తిరుమలలో 83.25 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

మండలంలో సోమవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షలలో 83.25 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యా శాఖాధికారి వరసా వెంకటరావు తెలిపారు. మండలంలోని మొత్తం జడ్‌పి, ప్రయివేట్ కలిపి 15 స్కూల్స్ నుంచి 567 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 472 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్కూల్స్‌లో 77.75 శాతం ఉత్తీర్ణత, ప్రయివేట్ స్కూల్స్‌లో 94.59 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. న్యూ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ దొరసానిపాడు, ఉషోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ తిమ్మాపురం, సెయింట్ జేవియర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ రాళ్లకుంట, ప్రభుత్వ పాఠశాల విభాగంలో జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల, జి.కొత్తపల్లి అధిక ఉత్తీర్ణత రాచురి కృష్ణతేజ 574 మార్కులు సాధించి ప్రభుత్వ స్కూల్ విభాగంలో మండల ఫస్ట్ నిలిచిందని హెచ్‌ఎం తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

BADTHALA BABU RAO అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.24-05-2023న Y5000899 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.12-04-2024న మా ఇంటి నుండి పోడూరు గ్రామం మెయిన్‌రోడ్‌కు వెళ్లుచుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

BADTHALA BABU RAO
S/o. Badthala Subba Rao
D.No.2-143, Pemmaraju Polavaram
Poduru Mandal, W.G.Dt. A.P.

CHANGE OF NAME

I, PAILA NAGESWARA RAO, S/o. PAILA MOHANA RAO, Resident of D.no. 2-14-48, Amudala Appala Swamy Colony, Eluru, AP - 534001. I have changed my name **PYLA NAGESWARA RAO** (Old Name) to **PAILA NAGESWARA RAO** (New Name). Hence after all my Documents and Correspondence will be continue with my New Name **PAILA NAGESWARA RAO.**

ముఖ్య వార్తలు

మంగళవారం 23 ఏప్రిల్ 2024

శ్రీరామ్‌తేజకు 591

ప్రజాశక్తి - ఏలూరు

పదో తరగతి ఫలితాల్లో యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు కుమారుడు శ్రీరామ్‌తేజ 591 మార్కులు సాధించాడు. శ్రీరామ్‌తేజను యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ కార్యవర్గం ప్రత్యేకంగా అభినందించింది. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

27న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష

భీమవరం :ఈ నెల 27న నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ పరీక్షకు అన్ని ఏర్పాట్లను పగడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షపై సమన్వయ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. 27న జిల్లాలోని 22 పరీక్షా కేంద్రాల్లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 7,329 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, మున్సిపల్, విద్యుత్, ఆర్‌టిసి, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవి కాలంలో స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ భవనం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఉపాధ్యక్షులు కె.సూరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పి.పాపారావు, ఇ.వెంకటేశ్వర్లు, ఎండి.ముస్తాఫా, వివిఎస్ఎన్.మూర్తి, ఎం.అర్జునరావు, కె.వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి పాల్గొన్నారు.

నరసాపురం : స్థానిక వైఎన్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల అకడమిక్ అడ్వైజర్ ఆర్‌వి.సుబ్బారావు చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.

వర్తకుల సమస్యలను పరిష్కరిస్తా : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం :టిడిపి కూటమి అధికారంలోకి రాగానే వర్తకుల సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారాలు చూపిస్తామని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం కిరాణా వర్తక సంఘం భవనంలో సోమవారం నిర్వహించిన చిల్లర కూరగాయల వర్తక సంఘ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిల్లర పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు చీరాల శ్రీను, వల్లభ తమ సమస్యలను బొలిశెట్టికి వివరించారు.

ప్రజా కళాకారుడు పులఖండం ఉగాది

పెనుమంట్ర :పలు సామాజిక సమస్యలను తన నాటిక, నాటకాల రచన, నటనల ద్వారా వెలుగులోకి తెచ్చిన ప్రజాకళాకారుడు పులఖండం ఉగాది అని మండలంలోని పలువురు కవులు, కళాకారులు అన్నారు. పులఖండం ఉగాదికి మార్టేరు కౌముది కళానికేతన్ అధ్యక్షులు చదువుల సుబ్రహ్మణ్యం, ప్రముఖ కవి కె.ఎన్నార్ నమ్మి, రచయిత చిర్ల రాజేంద్రప్రసాద్‌రెడ్డి నివాళు లర్పించారు.

డాక్టర్ పిపి.రావు మెమోరియల్ లిటిల్ బడ్స్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ఏలూరు

శ్రీదేవి

పదో తరగతి ఫలితాల్లో డాక్టర్ పిపి.రావు మెమోరియల్ లిటిల్ బడ్స్ విద్యార్థులు 42 మంది 550కి పైగా మార్కులు సాధించారు. 74 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. పరీక్షకు హాజరైన ప్రతి ఇద్దరి విద్యార్థుల్లో ఒక్కరు 500 పైగా మార్కులు సాధించారు. టిఆర్ఎస్.శ్రీదేవి 594, సిహెచ్.కావ్య 592, ఒజశ్విని 590, సత్విక 587, పావని 587, రాజేశ్వరి 586 మార్కులు సాధించారు.

న్యూ జనరేషన్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు

రేఖాలావణ్య

పదో తరగతి ఫలితాల్లో ఏలూరు గాంధీ నగర్‌లో ఉన్న న్యూ జనరేషన్ హైస్కూల్ వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. 25 మందిలో ఏడుగురు విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. ఎ.రేఖాలావణ్య 540, ఎస్.సాహిత్య 535, ఇమ్మానువల్ 528, మాళవిక 523, మణికంఠ 511, వి.అజయ్ 505, వివేక్ 501 మార్కులు సాధించారు. ఆ విద్యార్థులను, ఉపాధ్యాయులను కరస్పాండెంట్ ఎన్ఆర్‌కెవి.ప్రసాద్, హెచ్ఎం బేబి అభినందించారు.

శ్రీదీప్తి స్కూల్ విద్యార్థుల విజయదుందుభి

ప్రజాశక్తి - ఏలూరు

శాంతి స్వరూపిణి

స్థానిక పవర్‌పేటలో ఉన్న శ్రీదీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయ ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో పాఠశాల కరస్పాండెంట్ ఎన్.గిరిబాబు మాట్లాడుతూ కరణం శాంతి స్వరూపిణి 593, కోసనం ప్రవల్లిక 592 మార్కులు సాధించారన్నారు. అంతేకాకుండా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 550పైగా మార్కులు 11 మంది సాధించారన్నారు. 16 మంది 500 పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను అభినందించారు.

విజ్ఞాన్ ట్యూషన్ సెంటర్ ప్రభంజనం

ప్రజాశక్తి - తణుకు రూరల్

పది పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణతతో తణుకులోని స్టేషన్‌రోడ్డులో ఉన్న విజ్ఞాన్ ట్యూషన్ సెంటర్ సత్తా చాటుకుందని ట్యూషన్ సెంటర్ నిర్వాహకురాలు బి.మాధురి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారన్నారు. టి.శరత్‌పవన్(565), ఎస్‌కె.చంద్‌అనిఫ్(558), యు.శర్వాణి(540), ఎ.గౌతమ్‌కుమార్(539), పి.హేమంత్(537), టి.ప్రసన్న(535), ఆర్.సనారీష్(524), ఎస్.బిందుశ్రీ(521), పి.సాయిజ్యోతి(518), ఎం.రిషికేష్(516) మార్కులు సాధించారన్నారు.

శశి విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం : శశి తాడేపల్లిగూడెం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో ప్రభంజనం సృష్టించారు. పి.మేఘన 592, కె.గాయిత్రి 590, ఎస్.దేవిశ్రీ పోచమ్మ 590 మార్కులు సాధించారు. 59 కి పైగా మార్కులు ముగ్గురు, 580కి పైగా 20 మంది, 570కి పైగా 44 మంది, 550కి పైగా 87 మంది, 500లకు పైగా 141 మంది విద్యార్థులు సాధించారని ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

చింతలపూడి శశి విద్యార్థుల హవా

చింతలపూడి :శశి హైస్కూల్ విద్యార్థులు మండలంలో మొదటి మూడు స్థానాలు సాధించారు. కె.సత్యవాణి 593, పి.రానరాం 593, సత్యసాయి హర్షన్ 592, ఎస్.వర్షిత 591 మార్కులు సాధించారు. చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి 584 మార్కులు సాధించారు. ప్రయివేట్ పాఠశాలల్లో 93.46 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలవ్యాప్తంగా 1281 మందిలో 1070 మంది ఉత్తీర్ణత సాధించారు. 83.52 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఇఒ కిరణ్‌బాబు అభినందించారు.

సత్యవాణి

జెడ్‌పి బాలుర హైస్కూల్‌లో 65 శాతం ఉత్తీర్ణత

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాయ్స్ హైస్కూలు 65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు హేమలత తెలిపారు. శ్రీరమ్య 557, కెవి.చైతన్య 544, ఎస్‌కె.రియాజ్ 543, ముక్తార్ అహ్మద్ 538, టాపిక్ 510, అభిషేక్ 494 మార్కులతో టాపర్స్‌గా నిలిచినట్లు ఆమె తెలిపారు.

ఆదిత్య విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఆదిత్య స్కూలు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి తెలిపారు. 593 మార్కులతో పొన్నపల్లి మోక్షజ్ఞ టౌన్ ఫస్ట్‌గా నిలిచాడు. 588 మార్కులతో మహ్మద్ నఫీషా, 587 మార్కులతో చాగంటి సురేష్ నాయుడు, 586 మార్కులతో ఇంజేటి సారికశ్రీ తరువాతి స్థానాల్లో నిలిచారని తెలిపారు.

శ్రీసూర్య విద్యార్థుల హవా

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మజీ తెలిపారు. 586 మార్కులతో స్కూల్ ప్రథమ స్థానంలో బి.మోహనదేవి, 526 మార్కులతో ఆర్.రోషిణి ద్వితీయ స్థానంలో, 520 మార్కులతో జి.మౌనిక తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో ఉపాధ్యాయులతో పాటు శ్రీసూర్య విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మజీ, అకడమిక్ అడ్వైజర్ రామచంద్రారెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

డివిజన్ ప్రథమంలో రిబ్కా

ప్రజాశక్తి - వీరవాసరం

పది ఫలితాల్లో భీమవరం డివిజన్ ప్రభుత్వ పాఠశాలల పరిధిలో వీరవాసరం మండలం రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని జక్కంశెట్టి రిబ్కా 584 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, ఎంఇఒలు ఎన్.రాజేష్, ఎం.శ్రీమన్నారాయణ, సర్పంచి గెడ్డం భారతీభాస్కరరావు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్‌నాయుడు అభినందించారు.

ఆదిత్య విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదిత్య స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసినట్లు ప్రిన్సిపల్ కె.వాసుదేవ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరైన 34 మంది విద్యార్థుల్లో 33 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 21 మంది 500 పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి, లోకల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి దారుణ హత్య

భోగాపురంలో ఘటన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రెండు కుటుంబాల వివాదాల నేపథ్యంలో వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన పెదవేగి మండలంలోని భోగాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదవేగి మండలం భోగాపురం గ్రామానికి చెందిన పామర్తి రంగారావు, మండపాక వరప్రసాద్‌లు మేనత్త, మేనమామల కుమారులు. కొంతకాలంగా ఆ రెండు కుటుంబాల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం రహదారిపై వెళ్తున్న రంగారావును కూల్‌డ్రింక్ షాపులో ఉన్న వరప్రసాద్ పిలిచి ఒక్కసారిగా జేబులో నుంచి చాకు తీసి పొడిచాడు. దీంతో నడిరోడ్డుపై కుప్పకూలిన రంగారావు(44) తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వరప్రసాద్ ద్విచక్రవాహనంపై అక్కడ నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

గురజలో 1.20 ఎకరాల గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ముదినేపల్లి

తాార చువ్వాలు ఎగిరి వరిగడ్డివామిపై పడిన ఘటనలో 20 ఎకరాల మూడు వరి గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండలంలోని గురజలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు పి.కిరణ్మయి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో చనిపోయిన వ్యక్తికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకువెళ్లే క్రమంలో వేసిన తారా చువ్వాలు గడ్డివామిపై పడి మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో రెండు గడ్డివామిలపై నిప్పురవ్వలు ఎగిసిపడడంతో మూడు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.మూడు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు, గ్రామ ఉప సర్పంచి కిరణ్మయి తెలిపారు. సమాచారం అందుకున్న కైకలూరు, బంటుమిల్లి మండలాలకి చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపుచేశారు. విషయం తెలుసుకున్న ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

నాటుసారా విక్రేతపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మల్లప్పగూడెం గ్రామంలో నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

నాలుగో రోజు నాలుగు నామినేషన్లు దాఖలు

రిటర్నింగ్ అధికారులు

ఆర్‌డిఒ చెన్నయ్య

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ముగ్గురు అభ్యర్థులు నాలుగు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. సోమవారం ఉండి అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థిగా ఆకివీడు మండలం ఐ.భీమవరం గ్రామానికి చెందిన కనుమూరి రఘురామ కృష్ణంరాజు రెండు సెట్లు, కనుమూరి రఘు రామకృష్ణంరాజు కుమారుడు కనుమూరి భరత్ ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా వెలివర్రు గ్రామానికి చెందిన అల్లూరి సతీష్ చంద్రకుమార్ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు ప్రవీణ్ ఆదిత్య తెలిపారు.

తాడేపల్లిగూడెం : నాలుగో రోజు సోమవారం ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదని తాడేపల్లిగూడెం రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ కె.చెన్నయ్య తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియలో భాగంగా తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటి వరకూ ముగ్గురు అభ్యర్థులు ఒక్కోటి చొప్పున నామినేషన్లు దాఖలు చేసినట్లు చెన్నయ్య తెలిపారు.

నరసాపురం : నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఆర్‌డిఒ, ఆర్‌ఒ అచ్యుత అంబరీష్ తెలిపారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం ఛాంబరులో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. బొమ్మిడి నాయకర్ జనసేన తరపున మూడు సెట్లు, బొమ్మిడి సునీల్ నాయకర్ జనసేన తరపున ఒక సెట్, బుర్ర రామకృష్ణ పిరమిడ్ పార్టీ నుండి ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నామినేషన్లను అచ్యుత అంబరీష్ స్వీకరించారు.

చింతలపూడి : నియోజకవర్గంలో సోమవారం మూడు నామినేషన్ వేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి అద్దయ్య తెలిపారు. టిడిపి నుంచి సొంగా రోషన్ కుమార్, సొంగ ఇస్సాక్ రాజ్, సొంగ రోషన్ కుమార్, స్వతంత్ర అభ్యర్థిగా పచ్చిగోల జాన్ ధర్మరాజు నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ తణుకు అభ్యర్థిగా రామారావు నామినేషన్


రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామారావు

తణుకు:కాంగ్రెస్ తణుకు ఎంఎల్ఎ అభ్యర్థిగా కడలి రామారావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బివి.రమణకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. తొలుత ఉండ్రాజవరం జంక్షన్‌లోని తన నివాసం నుంచి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సిపిఎం నాయకులు కామన మునిస్వామి, కాంగ్రెస్ పిసిసి సభ్యులు దీర్సిపో రామకృష్ణ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తణుకు రూరల్: బిఎస్‌పి తణుకు నియోజకవర్గ అభ్యర్థిగా ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామానికి చెందిన ఆకుమర్తి ధనుంజయ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బివి రమణకు అందజేశారు.

చెత్త ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తాం : రాధాకృష్ణ

ప్రచారంలో తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకురూరల్

కూటమి అధికారంలోకి వచ్చాక చెత్త పన్ను రద్దు చేసి, చెత్త ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తామని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం తణుకు పట్టణంలోని 5వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమికి మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడికి వెళ్లినా డ్రెయినేజీ సమస్య తీవ్రంగా కనిపిస్తోందన్నారు. పారిశుధ్యాన్ని గాలికొదిలేశారని తెలిపారు. అధికారులను, సిబ్బందిని గుప్పిట్లో పెట్టుకుని ఎంఎల్ఎ కారుమూరి నాగేశ్వరరావు దందా నడిపించారని విమర్శించారు. తన సొంత సంపాదన పెంచుకునేందుకు మున్సిపాల్టీని వాడుకున్నారన్నారు. పట్టణంలో ప్రజలకు కనీస అవసరాలు తీర్చలేని ఎంఎల్ఎతో ప్రజలకు ఏం లాభం అని రాధాకృష్ణ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని విమర్శించారు. రాబోయే కాలంలో తణుకుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి రోడ్లు, ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, ఓమ్మి రాంబాబు, తణుకు రేవతి, బెజవాడ కృష్ణ, గమని రాము, సిర్రా సుధాకర్ పాల్గొన్నారు.

టిడిపి చింతలపూడి అభ్యర్థిగా రోషన్ నామినేషన్

నామినేషన్ వేస్తున్న సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థిగా సొంగా రోషన్ కుమార్ సోమవారం నామినేషన్ దాఖాలు చేశారు. నామినేషన్ దాఖలుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. రంగాపురం సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. ద్విచక్ర వాహనాలపై కేరింతలు కొడుతూ ర్యాలీలో పాల్గొన్నారు. సుమారు 40 ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం చింతలపూడి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని ఆర్‌ఒ అద్దయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేసిన సేవా కార్యక్రమాలే 2024 ఎన్నికల్లో తనను గెలిపిస్తాయన్నారు. అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ, బిసి రాష్ట కార్యదర్శి దాసరి శేషు పాల్గొన్నారు.

కాంగ్రెస్ భీమవరం అభ్యర్థిగా సీతారాం నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న సీతారాం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కాంగ్రెస్ భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థిగా అంకెం సీతారామ్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్‌కు ఇండియా వేదిక కూటమి మద్దతు తెలిపింది. స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్దకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో పాటు ఇండియా వేదిక పార్టీలైన సిపిఎం, సిపిఐ నాయకులు కార్యకర్తలు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ప్రకాశం సెంటర్ మీదుగా మావుళ్లమ్మ గుడి నుంచి ఆంధ్ర బ్యాంక్ రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సీతారాం అందజేశారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు రంగారావు, కాంగ్రెస్ నాయకులు రామరాజు, దుండి రవి, నాయకులు పాల్గొన్నారు.



సార్వత్రిక సంగ్రామం

మెట్ట, డెల్టా, ఏజెన్సీల సమ్మేళనం..

ఏలూరు

ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ చరిత్ర

మెట్ట, డెల్టా, ఏజెన్సీ ప్రాంతాల సమ్మేళనం ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం. ఓపక్క కృష్ణా, మరోపక్క తెలంగాణా సరిహద్దు ప్రాంతాలుగా విభిన్న ఆచారాలు, అలవాట్లకు ఇది కేంద్ర బిందువు.

ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం అంటే కొత్త ఏలూరు జిల్లానే. ఈ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు 1.ఏలూరు, 2.దెందులూరు, 3.ఉంగుటూరు, 4.పోలవరం, 5.చింతలపూడి, 6.నూజివీడు, 7.కైకలూరు

ఈ నియోజకవర్గం అనేక ప్రాముఖ్యతలకు నెలవు.

కొల్లేరు సరస్సు ఈ నియోజకవర్గంలోనే ఉంది. ప్రసిద్ధ మామిడి పండ్లు అయిన నూజివీడు రసాల నిలయం నూజివీడు దీని పరిధిలోనిదే. ఈ నియోజకవర్గ కేంద్రమైన ఏలూరు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాజధానిగా విరాజిల్లింది. జిల్లాల పునర్విభజన అనంతరం భీమవరం జిల్లా కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా రూపుదిద్దుకుంది. దీంతో జిల్లా కేంద్రం ఏలూరు పేరుతోనే ఏలూరు జిల్లా ఆవిర్భవించింది.

రాష్ట్రంలోనే పేరొందిన జ్యూట్‌మిల్లుల్లో ఏలూరులోని జ్యూట్‌మిల్లులు కూడా ఉన్నాయి. అయితే ఆ రెండు జ్యూట్‌మిల్లులు ప్రస్తుతం మూతపడటం బాధాకరం. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతం అంతా ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. జాతీయస్థాయి ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతమూ దీనిలోనే ఉంది. నూజివీడు ఐఐఐటి, ఏలూరు శివార్లలో ఉన్న కేంద్రీయ విద్యాలయం, కైకలూరు సమీపంలోని ఆటపాకలో వలస పక్షుల సంరక్షణ కేంద్రం తదితర ప్రసిద్ధ అంశాలకు ఈ నియోజకవర్గం వేదికగా చెప్పొచ్చు.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1952	కొండ్రు సుబ్బారావు	సిపిఐ	సి.అమ్మన్నరాజ	కాంగ్రెస్
	బిఎస్.మూర్తికె	ఎంపిపి	కె.నారాయణమూర్తి	సిపిఐ
1957	కెఎం వేదకుమారి	కాంగ్రెస్	వి.విమలాదేవి	సిపిఐ
1962	వి.విమలాదేవి	సిపిఐ	కెఎం.వేదకుమారి	కాంగ్రెస్
1967	కె.సూర్యనారాయణ	కాంగ్రెస్	వి.విమలాదేవి	సిపిఐ
1971	కె.సూర్యనారాయణ	కాంగ్రెస్	వివిజి.తిలక్	సిపిఐ
1977	కె.సూర్యనారాయణ	కాంగ్రెస్	గారపాటి కృష్ణమూర్తి	బిఎల్‌డి
1980	సిహెచ్.సుబ్బారావుచౌదరి	కాంగ్రెస్(ఐ)	కె.సూర్యనారాయణ	జనతా
1984	బోళ్ల బుల్లిరామయ్య	టిడిపి	వివిఆర్ పార్థసారధి	కాంగ్రెస్
1989	ఘట్టమనేని కృష్ణ	కాంగ్రెస్	బోళ్ల బుల్లిరామయ్య	టిడిపి
1991	బోళ్ల బుల్లిరామయ్య	టిడిపి	ఘట్టమనేని కృష్ణ	కాంగ్రెస్
1996	బోళ్ల బుల్లిరామయ్య	టిడిపి	మాగంటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
1998	మాగంటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	బోళ్ల బుల్లి రామయ్య	టిడిపి
1999	బోళ్ల బుల్లి రామయ్య	టిడిపి	మాగంటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
2004	కావూరి సాంబశివరావు	కాంగ్రెస్	బోళ్ల బుల్లిరామయ్య	టిడిపి

బిఎస్‌పి ఆచంట అభ్యర్థి చిన్నారావు నామినేషన్

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బిఎస్‌పి ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా ఆలూరి చిన్నారావు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడుకు సోమవారం అందజేశారు. మొత్తం మూడు సెట్లు అందజేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా హరికుమార్‌రాజు నామినేషన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థిగా పాతపాటి హరికుమార్ రాజు సోమవారం నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలీ తెలిపారు. ఇండియా వేదిక అభ్యర్థి హరికుమార్‌రాజుకు మద్దతుగా వామపక్షాల నాయకులు తొలుత ర్యాలీగా ఆర్‌ఒ కార్యాలయానికి చేరుకుని నామ పత్రాలు దాఖలు చేశారు. అలాగే పిరమిడ్ పార్టీ తరపున పెరుమాళ్ల మురళీకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్ వేస్తున్న హరికుమార్‌రాజు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉండి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రఘు రామకృష్ణంరాజు

ఉండి:ప్రజా సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘు రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేసిన అనంతరం రఘు రామకృష్ణం రాజు విలేకరులతో మాట్లాడుతూ తనకు విజయం అందించేందుకు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మే 14వ తేదీన తన పుట్టినరోజు అని అదే రోజు సర్వే పోల్ వస్తాయని అప్పటి నుంచి జగన్మోహన్ రెడ్డి ఇంటికే పరిమితం అవడం ఖాయమని తెలిపారు. శివరామరాజు తాను మంచి స్నేహితులమని, రెండు రోజుల్లో శివరామరాజుతో మాట్లాడి మద్దతు కోరతానని అన్నారు. జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు మాట్లాడుతూ రఘు రామకృష్ణంరాజుకు విజయం అందించాలని నాయకులను, కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, బిజెపి ఉండి నియోజకవర్గ కన్వీనర్ కోరాడ రామ్మూర్తి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్ల:టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజల సహకారంతో ఈ ఎన్నికల్లో ఉండిలో టిడిపి జెండా ఎగరేస్తామని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘు రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం పెదఅమిరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కేడర్‌ను ఒకే తాటిపైకి తెచ్చి అందరి సహకారంతో ఐక్యంగా విజయ ఢంకా మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పెదఅమిరం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈభారీ గజమాలతో ఎంఎల్ఎ అభ్యర్థి రఘు రామ కృష్ణంరాజును, సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజును సత్కరించారు.

కాంగ్రెస్ అభ్యర్థులు బుజ్జికి, గోపాలకృష్ణంరాజుకు బి ఫారాలు

నరసాపురం: రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేతుల మీదుగా కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర కృష్ణ ప్రసాద్ (బుజ్జి) నంద్యాలలో బి ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

కాళ్ల :ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. సోమవారం గోపాలకృష్ణంరాజు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేతులమీదుగా బి ఫారం సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి తనను ఎంఎల్ఎగా గెలిపించాలని కోరారు.

అభ్యర్థుల ఖర్చుపై నిరంతరం నిఘా

రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల ప్రచారంలో వ్యయ పరిమితికి మించి ఖర్చు చేసే అభ్యర్థుల ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ నోడల్ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో సీజర్ నిర్వహణ, ఖర్చుల వివరాలు, ఆడిటింగ్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా నీనా నిగమ్ మాట్లాడుతూ తనిఖీలు ముమ్మరం చేయాలని, సాధారణ పౌరులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికలు నిర్వహించడంలో ఖర్చులను అభ్యర్థుల ఖాతాలకు చూపడంలో నిష్పక్షపాతంగా ఎన్నికల సిబ్బంది వ్యవహరించాలన్నారు. మద్యం అమ్మకాలు, స్టాక్ షాపులకు వెళ్లే సరకు రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. భారీ ఎత్తున లావాదేవీల విషయంలో మరింతగా నిఘా పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ, అలాగే ఎన్నికల ప్రచారాన్ని తనిఖీ చేయడానికి ఇప్పటికే ప్రత్యేక బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఎన్నికల పరిశీలకునికి జిల్లాలోని వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరు గురించి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, జిల్లా ఎన్నికల నియంత్రణ కేంద్రం (కంట్రోల్ రూమ్), రాజకీయ ప్రచారానికి సంబంధించిన అనుమతుల వివరాలు, జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక కార్యకలాపాలు, ఎన్నికల సంబంధిత ఇతర అంశాలపై వివరించారు. జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల భద్రతా ఏర్పాట్లను వివరించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంసిఎంసి సెంటర్‌ను రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కె.సంగీత్ మాదూర్, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ సిహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

'హోమ్ ఓటింగ్'ను వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్, ఆర్‌ఒ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వినియోగించుకోలేనివారు హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వికలాంగులు, నడవలేని పరిస్థితిలో ఉన్నవారు, 85 సంవత్సరాల వయస్సు దాటిన వారు హోం ఓటింగ్ ద్వారా ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. దీనికోసం అర్హులైన అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకూ బిఎల్‌ఒలు సంబంధిత ఫారం 12 (డి) దరఖాస్తులను అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా వాటిని ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు సంబంధిత సెక్టరల్ ఆఫీసర్లు ఆయా ఇళ్లకు వెళ్లి వాటిని స్వయంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 23వ తేదీలోగా తిరిగి వారికి అందించాలన్నారు. దరఖాస్తులను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పరిశీలించి, అర్హతను పరిశీలించి అర్హత కలిగిన వారికి మే, 2వ తేదీ నుంచి 5వ తేదీలోగా ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఓటింగ్ ప్రక్రియ ఎన్నికల ప్రిసైడింగ్, ఇతర ఎన్నికల అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, బిఎల్‌ఒలు, సెక్టార్ అధికారులు, పార్టీల ఏజెంట్ల సమక్షంలో వీడియోగ్రఫీ ద్వారా జరుగుతుందన్నారు.

ఓటు వేయడం నైతిక బాధ్యత

వృద్ధాశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓటు నమోదు చేసుకోవడం, ఓటు వేయడం నైతిక బాధ్యత అని చినఅమిరం వృద్ధాశ్రమం నిర్వాహకులు భూపతిరాజు సత్యనారాయణ రాజు, గొట్టుముక్కల కృష్ణంరాజు అన్నారు. సోమవారం శ్రీవిజ్ఞాన వేదిక, జిల్లా రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చినఅమిరం వృద్ధాశ్రమంలో ఓటు విలువ దాని ప్రాముఖ్యత, పోలింగ్ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూరుశాతం పోలింగ్ జరగాలని భారత ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోందని, దీనిలో భాగంగానే వృద్ధులు, వికలాంగులకు కూడా ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ వృద్ధాశ్రమంలోని వృద్ధుల కోసం మే 13న ఓటేసేందుకు ప్రత్యేక ఆటో సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఓటర్ చైతన్య ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, ఆశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

టిడిపి దెందులూరు అభ్యర్థిగా చింతమనేని నామినేషన్


నామినేషన్ వేస్తున్న చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు రూరల్

టిడిపి దెందులూరు ఎంఎల్ఎ అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. దెందులూరు తహశీల్దార్ కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణికి నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. అంతకుముందు దుగ్గిరాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీగా తరలివచ్చారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన అభిమానుల కోలాహలం మధ్య ఆయన ర్యాలీ సాగించింది. చింతమనేని సాయి నవ్యశ్రీ తన తండ్రి తరపున సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జెసికి బి. లావణ్యవేణికి నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు.

బిఎస్‌పి దెందులూరు ఎంఎల్ఎ అభ్యర్థిగా నేతల రమేష్ బాబు నిర్మలాదేవి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు.

న్యూడెమోక్రసీ అభ్యర్థిగా రామ్మోహన్ నామినేషన్

నామినేషన్ పత్రాన్ని చూపుతున్న రామ్మోహన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి అట్టహాసంగా సరియం రామ్మోహన్ నామినేషన్ వేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థిగా సరియం రామ్మోహన్ సోమవారం ఐటిడిఎ వద్ద నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని, సమస్యలు పరిష్కారం కానిపక్షంలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. విద్య, వైద్యం ఇతర సౌకర్యాలు మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ముందుగా కన్నాపురం నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి ఐటిడిఎ వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్, ధర్ముల సురేష్ వెట్టి సుబ్బన్న నేతలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేట్ ఫస్టు ర్యాంక్ మనమ్మాయే

ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో బాలికలు హవా కొనసాగించారు. 20,785 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 17007 మంది ఉత్తీర్ణత పొందారు . దీనిలో బాలురు 8262 మంది, బాలికలు 8745 ఉత్తీర్ణత సాధించారు. బాలురుతో పోలిస్తే బాలికలే అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించారు. అయితే గతేడాది 65.95 శాతం ఉత్తీర్ణత సాధిస్తే ఈ ఏడాది 81.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో పశ్చిమ జిల్లా గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా 23వ స్థానంతో సరిపెట్టుకుంది. అయితే ఉత్తీర్ణత 17 శాతం పెరిగింది.

గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు

గతేడాది పబ్లిక్ పరీక్షల ఫలితాలతో పోలిస్తే ఈ ఏడాది పరీక్షల్లో పశ్చిమ జిల్లా మెరుగైన ఫలితాలు సాధించింది. గత విద్యా సంవత్సరంలో 20,268 మంది పరీక్షలకు హాజరవ్వగా వీరిలో కేవలం 13,360 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా కేవలం ఉత్తీర్ణత 65.93 శాతంగా నమోదైంది. సప్లిమెంటరీకి 8,717 మంది హాజరవ్వగా 4,150 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ నేతృత్వంలో విద్యా శాఖా యంత్రాంగం నిర్విరామంగా కృషి చేసింది. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలల్లో అదనంగా రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా దృష్టి సారించారు. సి-గ్రేడ్ విద్యార్థులు సుమారు మూడు వేలమంది ఉత్తీర్ణత సాధించడం విద్యాశాఖ ఘనతే. గతేడాది 65.95 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 81.7 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 17 శాతం ఉత్తీర్ణత పెరిగినట్లు డిఇఒ ఆర్.వెంకటరమణ ప్రకటించారు.

ఏలూరు స్పోర్ట్స్: పదో తరగతి ఫలితాల్లో అవరోహణ క్రమంలో అ'ద్వితీయం'గా ఏలూరు జిల్లా నిలిచింది. జిల్లా ఉత్తీర్ణత శాతం 80.08. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 19 శాతం ఉత్తీర్ణత పెరిగింది. ఈ ఏడాదీ బాలికలే తమ సత్తా చాటారు. జిల్లావ్యాప్తంగా 23,163 మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారు. అందులో 11,222 మంది బాలురు ఉండగా, 11941 మంది బాలికలు ఈ పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 8513 మంది బాలురు, 10,036 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 18,549 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు ఉత్తీర్ణతా శాతం 75.86గా నమోదైంది. ఈ విద్యా సంవత్సరంలో డిఇఒలు ముగ్గురు మారడం ఫలితాలపై ప్రభావం చూపిందనే అభిప్రాయం విన్పిస్తోంది.

తల్లిదండ్రులలో వనస్వి

మండల ప్రథమ స్థానంలో సాయిశ్రీ

ప్రజాశక్తి - మండవల్లి

పదవ తరగతి పరీక్షల్లో మండలంలోని విద్యార్థులు 61.42 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ డి.రామారావు తెలిపారు. మండవల్లి పాఠశాలకు చెందిన సాయి శ్రీ 578 మార్కులు సాధించి మండలం ప్రథమ స్థానంలో నిలవగా కానుకలు పాఠశాలకు చెందిన హేమశ్రీ 575 మార్కులతో ద్వితీయ స్థానం సాధించగా, లోకుముడి పాఠశాలకు చెందిన అపూర్వ 571 మార్కు సాధించి మండలం తృతీయ స్థానం సాధించిందని అన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్‌విఎస్ స్కూల్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి- తణుకు

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో తమ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారని ఎస్‌విఎస్ స్కూల్ ప్రిన్సిపల్, డైరెక్టర్ కేశవరావు తెలిపారు. సోమవారం స్థానిక స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం అభినందించారు. కె.కావ్య 600 మార్కులకు 580 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. బిసిహెచ్ రెడ్డి 569 మార్కులతో ద్వితీయ స్థానం, జయశ్రీ 553 మార్కులతో ద్వితీయ స్థానంలో సాధించినట్లు వివరించారు. టి.వైష్ణవి 551, జి.శ్రీ లలిత 548 మార్కులతో తర్వాత స్థానాల్లో నిలిచారన్నారు. తమ స్కూల్ విద్యార్థులు 95 శాతం పైగా ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ డైరెక్టర్లు కె.రామకుమార్, ఎం.సూరిబాబు, డి.రవితేజ అభినందించారు.

మీనాకి మండల ఫస్టు

ప్రజాశక్తి - యలమంచిలి

పదవ తరగతిలో మండలంలో 77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ కృష్ణంరాజు తెలిపారు. మొత్తం 11 హైస్కూల్స్ నుంచి 580 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా దీనిలో 443 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండల స్థాయిలో మట్లపాలెం హైస్కూల్‌కి చెందిన గుబ్బల మీనాక్షి 588 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, కొంతేరు హైస్కూల్ నుంచి మంచెం శివశ్రీ సాయి 562 మార్కులతో ద్వితీయ స్థానం, దొడ్డిపట్ల హైస్కూల్ నుంచి వలవల చంద్ర రాకేష్ తృతీయ స్థానం సాధించారు. మండల స్థాయిలో చించినాడ హైస్కూల్ 97 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.

జెడ్‌పి పాఠశాల టాపర్‌గా గీతిక

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కట్టిముక్కల గీతిక పదవ తరగతి పరీక్షలలో 567 మార్కులతో పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచింది. ఈమె తండ్రి వరప్రసాద్ లంకలకోడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంటాక్ట్ బేసిక్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. తల్లి సాధారణ గృహిణి. ఈమె ఐఐటీలో సీటు సాధించి మెకానికల్ ఇంజనీర్‌గా స్థిరపడాలని కోరుకుంటుంది.

జడ్‌పి విద్యార్థి సత్తా

పాలకొల్లు మండలం చింతపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగర సతీష్ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 560 మార్కులు సాధించి స్కూల్లో మొదటి స్థానంలో నిలిచాడు. మరొక విద్యార్థి అందే దినేష్ వెంకట త్రినాథ్ 558 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. మండలంలో పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారందరికీ మండల విద్యాశాఖ అధికారి శర్మ, ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారి గుమ్మల్ల వీరాస్వామి శుభాకాంక్షలు తెలిపారు.

మండలంలో 84 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత

మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలలో మొత్తం 1,631 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా 1,309 మంది 84 శాతం విద్యార్థులు పాసయ్యారు. లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో 71 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. తెలుగు మీడియంలో 52 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇంగ్లీష్ మీడియంలో కె.గీతిక 567 మార్కులతో, తెలుగు మీడియంలో వాసా సుమప్రియ 522 మార్కులు సాధించారు. దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 93 శాతం విద్యార్థులు విజయం సాధించగా, అరట్లకట్ట 92 శాతం మంది విద్యార్థులు విజయం సాధించారు. చింతపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎ.సతీష్ 560 మార్కులు సాధించారు. శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టి.బాబి 557 మార్కులు సాధించారు.

మాన్వితకు మండల ప్రథమ స్థానం

పెనుమంట్ర: మండలంలో పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలు 74 శాతం, ప్రయివేట్ పాఠశాలలు 99 శాతం ఫలితాలు సాధించారు. ఈ మేరకు ఫలితాలను ఎంఇఒ లక్ష్మీనారాయణ సోమవారం వెల్లడించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి 392 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 292 మంది 74 శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రయివేట్ పాఠశాలల నుంచి 71 మంది హాజరు కాగా 70 మంది 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రయివేట్ పాఠశాలల నుంచి పెనుమంట్ర విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని ఎ.మాన్విత 587 మార్కులతో మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. తర్వాత వరుసగా వనంపల్లి విద్యార్థి స్కూల్ విద్యార్థిని పసల లక్ష్మీ నాగ సహస్ర 582, మార్టేరు సంఘమిత్ర స్కూల్ విద్యార్థి కోనాల చంద్రమౌళి రెడ్డి 574 సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెనుమంట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి టిఆర్.సౌమ్య రెడ్డి 562, మార్టేరు ఎస్‌విజి ఉన్నత పాఠశాల నుంచి ఎస్.మాధవీలత 560, మార్టేరు బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి సానబోయిన హర్ష వర్ధన్ 560 సాధించారు.

బాలికలదే పై చేయి

ప్రజాశక్తి - పెనుగొండ

మండల స్థాయిలోనే గవర్నమెంట్ పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించారు. గవర్నమెంట్ పాఠశాలలో సాధించిన దేవ హైస్కూల్ విద్యార్థి గేదెల దేదీప్య 570 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. సెకండ్ ర్యాంకు వడలి హై స్కూల్ విద్యార్థి జగన్ తేజ 567 మార్కులతో సాధించారు. గవర్నమెంట్ హైస్కూల్లో 478 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 270 మంది పాసయ్యారు. విద్యార్థులు అత్యధికంగా 56 శాతంతో ఉత్తీర్ణులయ్యారని ఎంఇఒ 1, 2 తెలిపారు.

'ప్రయివేటు పాఠశాల వద్దు'

ఉండి: ప్రభుత్వ పాఠశాల ముద్దు.. ప్రయివేట్ పాఠశాల ముద్దు అని ఉండి మండలం పాందువ్వ గ్రామంలోని మండల పరిషత్ స్పెషల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గోపాలం అన్నారు. సోమవారం గ్రామంలోని ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందించే సదుపాయాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో బిఈడి చేసిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తద్వారా విద్యార్థులకు చక్కటి విద్య బోధనలు అలవర్చుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి చేర్చే విధంగా అవగాహన కల్పించారు.

20 రోజులు పరీక్షా కాలం

(మొదటి పేజీ నుంచి)

ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో డిపాజిట్లు, నగదు ఉపసంహరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడైనా అనుమానాస్పద కేసులు గమనిస్తే, వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ఎస్-ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, టీములు చురుగ్గా పని చేయాలన్నారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల అంశాలపై కూడా దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 16.35 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, అందుకు అనుగుణంగా 1744 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇంతవరకు రూ.13.54 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం సీజ్ చేశామన్నారు. అందులో రూ.198.92 లక్షల నగదు, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి, తదితరాలు, రూ.121.73 లక్షల విలువైన 38,998 లీటర్ల మద్యం స్వాధీనం చేసున్నారన్నారు. సి-విజిల్‌కు సంబంధించి 329 ఫిర్యాదులు పరిష్కరించినట్లు చెప్పారు. 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, మైక్రో అబ్జర్వర్లను నియమించి మొదటి విడత శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. పోలింగ్ సరళిని కూడా వీడియోగ్రఫీ చేస్తామన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో అంతర్‌రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల వద్ద 8 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ డి.పుష్పమణి, అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఎల్‌డిఎం నీలాద్రి, సి-విజిల్ నోడల్ అధికారి ఎన్ఎస్.కృపావరం, ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి పాల్గొన్నారు.

నాలుగో రోజు 36 నామినేషన్లు

(మొదటి పేజీ నుంచి)

సాగింది. ఈ నెల 25 వరకూ నామినేషన్ల పర్వం సాగనుంది. నామినేషన్ల సందర్భంగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ర్యాలీలతో బల ప్రదర్శనకు దిగుతున్న పరిస్థితి ఉంది. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి కొనసాగుతోంది.

పవన్ పర్యటన వాయిదా

(మొదటి పేజీ నుంచి)

బస్టాండ్ ప్రాంతంలో సభకు అన్ని ఏర్పాట్లు చేశారు. పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు ఉదయం నుంచి పోలీస్ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు మొత్తం బ్లాక్ చేసి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో తణుకు, ఏలూరు నుంచి వెళ్లే బస్సులు బస్టాండ్‌కు వెళ్లేందుకు నానా ఇబ్బందులు ఏర్పడ్డాయి. తాడేపల్లిగూడెం ఊరి శివారున ఏర్పాటు చేసిన రెండో ఫ్లయ్ ఓవర్ మీదుగా బస్సులను మళ్లించడంతో ప్రయాణం తీవ్ర ఆలస్యమైంది. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గణపరంలోనూ అదే పరిస్థితి నెలకొంది. పవన్‌కల్యాణ్ బందోబస్తుకు వచ్చిన పోలీసులు ఉదయం నుంచి ఎండలో పడిగాపులు కాశారు. పవన్‌కల్యాణ్ ఒక అరగంటలో వచ్చేస్తారు అనుకుంటున్న సమయంలో పర్యటన రద్దు చేసినట్లు తెలిపారు. దీంతో అంతా ఒక్కసారిగా నీరసించిపోయారు. పవన్ రారని తెలిశాక నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, తాడేపల్లిగూడెం జనసేన ఎంఎల్ఏ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ సభా వేదికపై నుంచి మాట్లాడేందుకు ప్రయత్నించారు. కొద్దిసేపు మాట్లాడేసరికి జనం వెళ్లిపోవడంతో వెంటనే ముగించేశారు. మండు వేసవిలో ఈ విధంగా అర్ధాంతరంగా పర్యటను రద్దు చేయడంపై ఆ పార్టీలోనే తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం పిఠాపురంలో పవన్‌కల్యాణ్ నామినేషన్ వేయనున్నారు. దీంతో మళ్లీ జిల్లా పర్యటన ఎప్పుడు జరిగేది త్వరలో వెల్లడించనున్నట్లు జనసేన నాయకత్వం తెలిపింది.

నామినేషన్లకే ఇంత ఖర్చా..!

(మొదటి పేజీ నుంచి)

సమావేశాలు, సమ్మేళనాలు, కులాలవారీగా సమావేశాలు, పార్టీలో చేరికలు, ప్రచార కార్యక్రమాలు, బ్యానర్లు, జెండాలు, కరపత్రాలు ఇలా ఒక్కటేమిటి అన్నీ డబ్బుతోనే ముడిపడి ఉన్నాయి. నామినేషన్లు వేసేందుకే కోట్లలో ఖర్చు చేస్తుండటం గమనార్హం. అభ్యర్థులు జన సమీకరణ చేసి బల ప్రదర్శన చేస్తున్నారు. ఆచంట, భీమవరం, ఉండి ప్రాంతాల్లో జరిగిన నామినేషన్ల కార్యక్రమంలో అభ్యర్థులు భారీగా ఖర్చు చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఒక్కో అభ్యర్థి నామినేషన్‌కు ఐదు వేల మందికిపైగా సమీకరిస్తుండటం విశేషం. వీరందరికీ డబ్బు, పెట్రోల్ ఖర్చు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, మద్యం ఇలా అన్ని ఖర్చులూ అభ్యర్థులే భరిస్తున్నారు. అయితే ఎన్నికల సంఘం వీటన్నింటినీ నివారించాలని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన వ్యయ కమిటీలతోపాటు ఇతర కమిటీలు కూడా అభ్యర్థుల ఖర్చు లెక్కింపులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి ఒకలా, ప్రతిపక్ష పార్టీల పట్ల మరోలా ఎన్నికల అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అభ్యర్థులు నామినేషన్ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవట్లేదనే ఆరోపణలు ఉన్నాయి.

భాష్యం విద్యార్థుల విజయ కేతనం

ప్రజాశక్తి - నరసాపురం

సోమవారం విడుదలైన 10వ తరగతి ఫలితాలలో నరసాపురం భాష్యం విధ్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనభరిచారని ప్రిన్సిపల్ వి.ఆంజనేయులు తెలిపారు. కర్రా మంజుహాసిని 593, పాకలపాటి వైష్ణవి 592, సామంతకుర్తి లక్ష్మి శ్రావణి 590 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ చూపారని అన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు జిల్లా జోనల్ ఇన్‌ఛార్జి ఎ.శ్రీమన్నారాయణ రెడ్డి, భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ అభినందనలు తెలిపారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థులు ప్రతిభ

పదో తరగతి ఫలితాల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ ఎస్.సరళ తెలిపారు. సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణత 91 శాతం నమోదైంద న్నారు. స్కూల్ ఫస్ట్ కారగాని సాత్విక 577, ఎలమర్తి జగదే 559 మార్కులతో అత్యుతమ్మ ప్రతిభ కనభరచారని అన్నారు. మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను కోఆర్డినేటర్ ఎం.సమత, ప్రిన్సిపల్ ఎస్.సరళ, వైస్ ప్రిన్సిపల్ వి.సుభాషిణి అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

సోమవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో నరసాపురం శ్రీ చైతన్య విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని ఆర్ఐ రాజ్ కుమార్ తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్‌లో 500 పైబడి మార్కులు 44 మంది సాధించారన్నారు. శ్రీ చైతన్య స్కూల్‌లో ప్రథమ స్థానం మాదాసు బ్రాహ్మణి 590, ద్వితీయ స్థానం మామిడిశెట్టి మంజూకార్తిక్ 588, తృతీయ స్థానం తిరుపతి సంజయ్ 585 సాధించారని రాజ్ కుమార్ తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, మంచి ఫలితాలు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఆర్ఐ రాజ్.కుమార్, కోఆర్డినేటర్ రామారావు, ప్రిన్సిపల్ వేణుగోపాలరావు, డీన్ కృష్ణంరాజు, ఇన్‌ఛార్జి ఆలీ అభినందించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

కాళ్ల: మండల పరిధిలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రయివేటు పాఠశాల విద్యార్థులు మొత్తం 618 మంది పదవ తరగతి విద్యార్థులకు 508 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ-1 ఎ.రవీంద్ర, ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు సోమవారం తెలిపారు. కాళ్ళ హైస్కూల్ విద్యార్థులు 107 మంది పరీక్షలు రాయగా 76 మంది పాసైయ్యారు. 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాళ్ల హైస్కూల్ విద్యార్థి అవురు లిఖిత 572 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని వివరించారు. దొడ్డనపూడి హైస్కూల్ విద్యార్థులు 64 మంది పరీక్ష రాయగా 53 మంది పాసైయ్యారు.

'పది' ఫలితాల్లో 79.5 శాతం ఉత్తీర్ణత

మొగల్తూరు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో 79.5 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ తెలిపారు. మొగల్తూరులో వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన చిన్నిమిల్లి మహశ్రీ మౌనిక 588 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం, ప్రతిభ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన నాయుడు భావన 584 మార్కులతో ద్వితీయ స్థానం, పులపర్తి వారి తోటలో ఉన్న జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన పులపర్తి జాహ్నవి 582 మార్కులతో, జగన్నాధపురం గ్రామంలో ఉన్న జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన పితాని లక్ష్మీ నాగశ్రీ 582 మార్కులతో తృతీయ స్థానాల్లో నిలిచారని ఎంఇఒ తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గణపవరం బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హైస్కూల్ హెచ్ఎం కెబి.బాల భాస్కర్ రావు సోమవారం తెలిపారు. తమ హైస్కూల్‌కి చెందిన నబి గారి మేఘన 600కి 583 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యార్థులు 88 శాతం, తెలుగు మీడియంలో 49 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 500 మార్కులు దాటిన విద్యార్థులు 9 మంది ఉన్నారని వారిని అభినందించారు.

విద్యా జ్యోతి విద్యార్థుల ప్రతిభ

దీప్స

ప్రసన్న

మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గణపవరం విద్యా జ్యోతి మెరిట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మండలం ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు కాన్వెంట్ ప్రిన్సిపల్ సిహెచ్.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. పరీక్ష ఫలితాల్లో దీప్సకు 600కు 589 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఎస్ఎల్ ప్రసన్నకు 600కి 585 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు.

జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థుల విజయం

మండలంలో గణపవరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విజయం సాధించినట్లు హైస్కూల్ హెచ్ఎం వివిఎస్ఎన్.మూర్తి సోమవారం తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు 52 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరిలో మహమ్మద్ అమీన్ ముల్దిన్ 578 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఉండి మండలానికి చెందిన ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థిని మానే చాతుర్య 590 మార్కులతో మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని ఇండియన్ డిజిటల్, గీతాంజలి ఇంగ్లీష్ మీడియం, చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ నూటికి నూరు శాతం ఫలితాలను సాధించగా శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 96 శాతం ఫలితాలు సాధించింది. ప్రభుత్వ పాఠశాలలో గత ఏడాది కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలను సాధించాయి. ఉండి శశి హైస్కూల్ 26 మంది విద్యార్థులకు 25 మంది విద్యార్థులు, ఎండగండి చైతన్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 47 మంది విద్యార్థులకు 47 మంది విద్యార్థులు, ఇండియన్ డిజిటల్ స్కూల్ 23 మంది విద్యార్థులకు 23 మంది విద్యార్థులు, గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 12 మంది విద్యార్థులకు 12 ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉండి హై స్కూల్ 112 విద్యార్థులకు 85 మంది, ఎన్ఆర్‌పి అగ్రహారం హై స్కూల్ 27 మంది విద్యార్థులకు 23, కోలమూరు హైస్కూల్ 24 మందికి 22, ఉప్పులూరు హైస్కూల్ 31 మందికి 29, మహదేవపట్నం హైస్కూల్ 86 మందికి 63, ఉనుదుర్రు హై స్కూల్ 11 మందికి 10, చెరుకువాడ హై స్కూల్ 84 మందికి 65, ఎండగండి హై స్కూల్ 91 మందికి 89 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తంగా ప్రభుత్వ పాఠశాలలో 466 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 386 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 82 శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రయివేట్ విద్యా సంస్థల్లో 108 మంది విద్యార్థులకు 107 మంది ఉత్తీర్ణులై 99 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులలో ఎండగండి హై స్కూల్ విద్యార్థిని దీనబోయిన రమ్య 575 మార్కులు సాధించిందని తెలిపారు. ఈ సంవత్సరం మండల స్థాయిలో ఎండగండి చైతన్య స్కూల్ విద్యార్థిని సిరి చందన ప్రియ 584 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

పెదతాడేపల్లి గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పెదతాడేపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ బి.రాజారావు సోమవారం తెలిపారు. గురుకుల పాఠశాల నుంచి 82 మంది విద్యార్థులు హాజరుకాగా పరీక్షా ఫలితాల్లో మొత్తం 82 మంది విద్యార్థులు విజయం సాధించారని హర్షం వ్యక్తంచేశారు. 28 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని తెలిపారు. వారిలో బర్రే ప్రకాష్ 578 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. టేకు కుమార్, శ్రీసత్య సాయి 576 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. బందెల శశిధర్ 500 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అంబేద్కర్ గురుకుల పాఠశాల జిల్లా సమన్వయ కర్త ఎన్.భారతి, ప్రిన్సిపల్ రాజారావు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

వాణి పబ్లిక్ స్కూల్ విద్యార్థుల విజయభేరి

కృషి, పట్టుదల, ఏకాగ్రతతో చదివితే సామాన్య విద్యార్థులు సైతం రాష్ట్రస్థాయి మార్కులతో విజయం సాధించవచ్చని వాణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నిరూపించారని వాణి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వాణి కృష్ణ అన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో వాణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి అత్యధికంగా 600 మార్కులకు 591 మార్కులు సాధించినందుకు వారిని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెంలో 77.3 శాతం ఉత్తీర్ణత

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో మొత్తం 3 పాఠశాలల విద్యార్థులు 77.3 శాతం ఉత్తీర్ణత సాధించారని తాడేపల్లిగూడెం ఎంఇఒ-2 పి.జ్యోతి సోమవారం తెలిపారు. పట్టణంలో 73.3 శాతం, మండలంలో 79.6 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. పట్టణంలోని తేతలి సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 65 శాతం ఉత్తీర్ణత సాధించగా మొత్తం 160 మంది పరీక్షలు రాయగా 104 మంది ఉత్తీర్ణత అయ్యారని, 56 మంది ఫెయిల్ అయినట్లు ఆమె వివరించారు. కాగా పట్టణంలోని తేతలి సత్యనారాయణ జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ఏలూరి కీర్తి 575 మార్కులతో స్కూల్ ప్రథమ స్థానం, 573 మార్కులతో సూర్యకళ ద్వితీయ స్థానం సాధించారన్నారు. 16 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించినట్లు హెచ్ఎం.సత్యనారాయణ తెలిపారు. ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.వాసవి 576 మార్కులు సాధించినట్లు, ముదునూరుపాడు మాగంటి అన్నపూర్ణ మెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.ప్రియ 586 మార్కులు సాధించినట్లు ఎంఇఒ వివరించారు.

పది పరీక్ష ఫలితాల్లో బాలికలదే హవా

భీమవరం రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాలలో భీమవరం మండలంలోని బాలికలే పైచేయి సాధించారు. సోమవారం విద్యాశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలం నుంచి 639 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 525 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఇఒ ఎన్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వారిలో బాలురు 256, బాలికలు 269 మంది పాసైయ్యారన్నారు. మండలం ప్రథమస్థానంలో కొవ్వాడ జడ్‌పిహెచ్ హైస్కూల్‌కు చెందిన జుత్తిగ 573, సెకండ్ దిల్సుమద్రు, జడ్‌పిహెచ్ హైస్కూల్ కాపు చెట్టి పూర్ణ చంద్రిక 567లు నిలిచారన్నారు. వారిని ఎంఇఒ అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా

వీరవాసరం: మండలంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పది ఫలితాలు సందర్భంగా అండలూరు హైస్కూల్‌లో 28 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 21 మంది ఉత్తీర్ణత సాధించారు. కె.ముస్తాఫానజీర్ 423 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. కొణితివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 105 మంది రాయగా 82 మంది ఉత్తీర్ణత సాధించారు. జి.యశ్వంత్ అనే విద్యార్థి 565 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 97 మంది పది పరీక్షలు రాయగా 84 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎ.రెభకా అనే విద్యార్థిని 584 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. తోలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 57 మంది పది పరీక్షలు రాయగా 51 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎ.రామచరణ్ తేజ అనే విద్యార్థి 558 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. వీరవాసరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 135 మంది పరీక్షలు రాయగా 107 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎం.జోత్స్న 572 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. కె.కీర్తణ 469 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. మత్స్యపురి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 57 మంది పరీక్షలు రాయగా 31 మంది ఉత్తీర్ణత సాధించారు. కె.మౌణికలక్ష్మీ 546 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఆచంట: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఆచంట మండలంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎ.ఉషారాణి, పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలో 449 మంది విద్యార్థులు గాను 335 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 129 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 100 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఆచంట వేమవరం 55 మందికి గాను 54 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వల్లూరు ఎంపీ పాలెం 72 మందికి 51, పెనుమంచిలి 39 మందికి 27 మంది, కరుగోరుమిల్లి 25 మందికి 21 మంది, భీమలాపురం 29 మందికి 18 మంది, కొడమంచిలి 78 మందికి 45 మంది, కోడేరు 22 మందికి 19 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రయివేట్ పాఠశాలలో, హెూలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 59 మందికి 59 మంది, స్మెక్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 11 మంది విద్యార్థులకు 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. మండల ప్రథమ స్థానం దక్కించుకున్న వల్లూరు ఎంపీ పాలెం మట్ట సింధు588, వల్లూరు ఎంపీ పాలెం ద్వితీయ స్థానం దక్కించుకున్న యు.సౌమ్య569, ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తృతీయ స్థానం దక్కించుకున్న మట్టపర్తి నిఖిల్ సాయి పవన్ 561ను ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్, తహశీల్దార్ ఐపిశెట్టి, మండల విద్యాశాఖ అధికారులు ఎ.ఉషారాణి, పి.రాజేంద్రప్రసాద్ అభినందించారు.

హెూలీ ఏంజెల్స్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఆచంట మండలం కొడమంచిలిలో హెూలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో విద్యార్థులు మండలంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ఆ స్కూల్ కరస్పాండెంట్ కుక్కల రవికుమార్, ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరంకి 10వ తరగతి పరీక్షలకు 59 మంది విద్యార్థుల్లో 58 మంది ప్రథమ స్థానంలోనూ ఒక విద్యార్థి ద్వితీయ స్థానంలోనూ 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. బొక్క పల్లవి 588, మున్నీ రూపా 569, కె.రాకేష్ 568, బొక్క భాను తేజ 563 మార్కులు సాధించినట్లు తెలిపారు.

సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

పోడూరు: సోమవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల వ్యాప్తంగా 521 మంది విద్యార్థులు హాజరు కాగా 375 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. 146 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. మండలం మొత్తం ఉత్తీర్ణత శాతం 72 కాగా ఇంగ్లీషు మీడియంలో ఉత్తీర్ణత శాతం 83, తెలుగు మీడియంలో ఉత్తీర్ణత శాతం 60, మండలం మొదటి స్థానం కొమ్ము చిక్కాల జడ్‌పి హైస్కూల్‌కు చెందిన ఇమ్మలరాజు, మోక్షిత దుర్గా వెంకట సాయి కార్తీక 587, రెండవ స్థానం గుమ్మలూరు జడ్‌పి గుండు కృష్ణ లహరి 563, తృతీయ స్థానం గుమ్మలూరు జడ్‌పి హైస్కూల్ విద్యార్థిని జోగి మౌనిక 556 మార్కులు, కోట సుభాషిణి 556 మార్కులు సాధించారు.

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

రూట్స్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - తణుకురూరల్

పదో తరగతి ఫలితాల్లో స్థానిక రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి విజయకేతనం ఎగు రవేశారని స్కూల్ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి తెలిపారు. పరీక్షకు హజరైన 173 విద్యార్థుల్లో 590 మార్కులతో పి.సుమేధా స్కూల్ టాపర్‌గా నిలిచిందన్నారు. టి.రేణుశ్రీ 584, ఎస్.లావణ్య, ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డిలు 583, కె.మోహనసూర్యతేజస్విని 580 మార్కులు సాధించగా వంద మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి మాట్లాడుతూ అనుభవం, అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయ బృందం బట్టీ విధానంతో కాకుండా అవగాహనతో కూడిన విద్యనందించడం వల్ల ఇంతటి ఘన విజయం రూట్స్‌కి సాధ్యమైందన్నారు. స్కూల్ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సంస్థ డైరెక్టర్లు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సంస్థ డైరెక్టర్లు ఎల్‌కె.త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఎన్.సుధాకర్‌వర్మ అభినందించారు.

శశి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - కలిదిండి

హేమహారిక

స్థానిక శశి హైస్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కరస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు తెలిపారు. జి.హేమహారిక 553 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. డి.కుందహాసిని 552 మార్కులతో పి.లక్ష్మీదేవి 548 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

శ్రీగౌతమి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం శ్రీ గౌతమి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్ తెలిపారు. 590 మార్కులతో అయితం ఉజ్వలరాణి ప్రథమ, 583 మార్కులతో ఎం.అర్షిత, ఎన్.విషిత ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. వై.కీర్తి 577, సిహెచ్.దీప్సికా 576, ఎన్.ఎంజీలీనా 573, టి.చైతన్య 571 మార్కులు సాధించారన్నారు.

రూ.1.59 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం ఒక వ్యక్తి వద్ద రూ.1.59 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెక్ పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. ఈ నగదు కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన ఆటోలో వెళ్తున్న వ్యక్తి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వాహనాల తనిఖీల్లో పోలీసు సిబ్బంది కె.రామకృష్ణ, సూర్య నాయక్, ఎ.సుధీర్, ఎం.నాగార్జున పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో పిప్పర వద్ద వాహనాల తనిఖీలో పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన పలివెల మహేష్ గుప్తా వద్ద నుంచి రూ.1.65 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్‌టి అధికారి లక్ష్మీసరస్వతి తెలిపారు. ఈ తనిఖీల్లో గణపవరం పోలీసులు శివాజీ, రాజేష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుమార్తె మండల ఫస్ట్

ప్రజాశక్తి - కాళ్ల

ఓ ఆటో డ్రైవర్ కుమార్తె పదో తరగతిలో తన ప్రతిభను చాటింది. కాళ్ల హైస్కూల్ విద్యార్థిని అవురు లిఖిత 572 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన అవురు లిఖిత తండ్రి సోమేశ్వరరావు ఆటో నడుపుతూ ఉంటాడు. కుమారుడు, కుమార్తె అనే తారతమ్యం చూపకుండా లిఖితను కూడా చదివించాడు. పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో సొంత అవసరాలను సైతం ఆయన పక్కన పెట్టేవారు. కుమార్తె లిఖిత పదో తరగతి ఫలితాల్లో సాధించిన విజయం పట్ల తండ్రి సోమేశ్వరరావు, తల్లి విజయ ఎంతగానో మురిసిపోతున్నారు. ట్రిపుల్ ఐటీలో సీటు ఇంజినీరింగ్ చదువుతానని లిఖిత తెలిపారు. లిఖిత తమ్ముడు కాళ్ల హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

మానస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమడోలు

దేవి అనూష్క

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల తమ ప్రతిభను మరొకమారు చాటుకొంది. పాఠశాల నుంచి 124 మంది పరీక్షలకు హాజరు కాగా 39 మంది 550 మార్కులకుపైగా, 69 మంది 500కు పైగా మార్కులు సాధించారు. పాఠశాల విద్యార్థిని వి.జాహ్నవి దేవి అనుష్క 591 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇదే క్రమంలో వి.గాయత్రీహర్ష 586, కె.అలేఖ్య 584, యు.జాహ్నవి, పి.నాగసాయి మహేష్ 583, కె.లక్ష్మీసురేఖ, కె.మోహిత 582, కె.లీలాభాగ్యశ్రీ 581 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వై.రవీంద్రకుమార్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బంది నిరంతరం చేసిన కృషి, ఇదే క్రమంలో విద్యార్థులు అంకిత భావంతో చదవడం కారణంగా తమ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకే అత్యున్నత స్థానం

ప్రజాశక్తి - ఆకివీడు

వైష్ణవి, జశ్వంత్, నహీజ, తనుశ్రీ

మండలంలో ఈ ఏడాది కూడా ప్రయివేట్ పాఠశాలలకే అత్యున్నత స్థానం లభించింది. ఆదిత్య, శారద, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ఉన్నత స్థానంలో నిలిచారు. మండలంలో ఒక మార్కు తేడాతో కార్పొరేట్ పాఠశాల నారాయణ ప్రథమ స్థానం సాధించింది. 587 మార్కులతో స్థానిక విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థి సిహెచ్. తను శ్రీ, సెంట్ అలోసియస్ హై స్కూల్ విద్యార్థి టి.కిరణ్, వి.షర్లి ఆనందితలు మండలంలో రెండో స్థానంలో నిలిచారు. 586 మార్కులతో శారదా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి పి.వెంకన్న బాబు, ఆదిత్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి ఎం.జస్వంత్ మూడో స్థానంలో నిలిచారు.

వైష్ణవిదే అగ్రస్థానం

మండలంలో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల కలిపి మొత్తం ఎనిమిది పాఠశాలల్లో చినకాపవరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి వైఎన్ఎస్.వైష్ణవి 576 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. మండలంలో పెదకాపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రయివేట్ రంగంలో విజ్ఞాన్, వాసవి శారద, నారాయణ, సెయింట్ అలోసియస్ హైస్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండలవ్యాప్తంగా 695 మంది పరీక్షకు హాజరు కాగా 598 మంది ఉత్తీర్ణత సాధించడంతో 88 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఎంఇఒ రవీందర్ తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

ఆదిత్య విద్యార్థుల అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్యకృష్ణంరాజు తెలిపారు. స్కూల్లో అత్యుత్తమ మార్కులు జి.మనస్విని 592, టి.లక్ష్మీప్రసీద 588, ఎస్‌డి.అయూబ్ 587, బి.పౌర్ణమి 586, జె.కార్తీకదేవీ 586, ఎల్.దినేష్‌పవన్‌సాయి 584, జి.హాసిని రిత్విక 583, కెవివిఎస్.వాసవిలక్ష్మి 581, కె.హుమేష్‌బాలసాయి సుభాష్ 580 మార్కులు సాధించినట్లు తెలిపారు. 540పైగా మార్కులు 54 మంది, 500 పైగా మార్కులు 80 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు.

మాంటిస్సోరి విద్యార్థుల ఘనత

ప్రజాశక్తి - తణుకు

జయకిరణ్, గీతిక, ప్రతిక్‌రాజ్, కావ్యనాగశ్రీ

పదో తరగతి ఫలితాల్లో తమ స్కూలు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగరవేశారని మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాష్‌రావు తెలిపారు. స్థానిక స్కూల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించడం వల్లే మంచి ఫలితాలు సాధించగలిగామన్నారు. సిహెచ్.జయకిరణ్ 593 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడన్నారు. వి.గీతిక, జి.ప్రతిక్‌రాజ్ 592 మార్కులతో రెండో స్థానంలో, జి.కావ్యనాగశ్రీ 588 మార్కులతో మూడో స్థానం సాధించినట్లు వివరించారు. మొత్తం 248 మంది పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. 16 మంది 580పైగా 73 మంది 550పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. స్కూల్ టాపర్ జయకిరణ్‌కు రూ.37,500 నగదు బహుమతిని స్కూల్ యాజమాన్యం ఇచ్చి అభినందించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ప్రకాష్‌రావు అభినందనలు తెలిపారు.

జ్ఞానానంద విద్యార్థుల విజయదుందుభి

ప్రజాశక్తి - కాళ్ల

మణివిఘ్నేష్

పదో తరగతి ఫలితాల్లో ఏలూరుపాడు జ్ఞానానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారని విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ దాట్ల విజయకుమారి తెలిపారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మండలంలో 570 మార్కులతో కట్టా మణి విఘ్నేష్ ద్వితీయ, 564 మార్కులతో అంకాల రమ్య జ్యోతి, పొన్నాడ కావ్యాంజలి తృతీయ స్థానాలు సాధించారన్నారు. దాట్ల హర్ష-శ్రీవెంకటరామరాజు 556 మార్కులు సాధించారన్నారు.

తిరుమల విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

పది ఫలితాల్లో భీమవరం తిరుమల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతతో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె.మోహిత్‌గుప్త 596 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పిబి.నాగేంద్రవర్మ 596, టి.సుస్మిత 594, ఎస్ఎస్.సాయిశ్రీకర్ 593, జి.రోషిత్ 593, కెజెఎస్. శ్రావ్య 592, పిఎల్.సహస్ర 591, సిహెచ్‌డి. బాలాజీ 591, ఆర్.హాసిని 590, ఎస్‌కెబి.మస్తాన్ వలి 590, కెవివి.హర్ష 590 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్లు ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు మాట్లాడుతూ 497 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 497 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 77.66 శాతం విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారన్నారు.

మానవాళి దోపిడీ విముక్తికి సోషలిజమే మార్గం

లెనిన్ జయంతి వేడుకలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచ మానవాళి దోపిడీ విముక్తికి సోషలిజమే మార్గమని చాటి చెప్పింది విఐ.లెనిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ కొనియాడారు. సోమవారం లెనిన్ జయంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం ఆఫీస్ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిషోర్ మాట్లాడుతూ ప్రపంచంలో దోపిడీ నుంచి మానవులకు విముక్తి కలిగించేది సోషలిజం, కమ్యూనిజం మాత్రమేనని, దాన్ని ఆచరణలో నిరూపించింది లెనిన్ అని కొనియాడారు. ప్రపంచ చరిత్రను పరిశీలించి, పరిశోధించి మానవాళి దోపిడీ విముక్తికి మార్గాన్ని కార్ల్‌మార్క్స్ వెతికితే, దాన్ని ఆచరణలో తీసుకొచ్చింది లెనిన్ అని అన్నారు. లెనిన్ తెచ్చిన సోవియట్ యూనియన్ విప్లవం తర్వాత ప్రపంచంలో అనేక వలస దేశాలు తమ తమ బానిసత్వం నుంచి విముక్తి కోసం స్వాతంత్ర పోరాటాలు సాగించాయన్నారు. సోషలిస్టు రష్యా విప్లవం తర్వాతనే మన భారతదేశంలో కూడా స్వాతంత్రం సిద్ధించిందని గుర్తు చేశారు. స్వాతంత్ర భారతదేశానికి ప్రారంభంలో సోషలిస్ట్ రష్యా (లెనిన్) ప్రభుత్వం చాలా సహకారం అందించిందని తెలిపారు. అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తమ దేశంలో కూడా సోషలిస్ట్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించడమే దానికి నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాలకు లెనిన్ చూపిన మార్గం నేటికి అనుసరణీయమన్నారు. లెనిన్ ఎంతటి గొప్పవాడు అంటే ఆయన చనిపోయిన తర్వాత కూడా ఇప్పటికీ ఆయన మృతదేహాన్ని రష్యన్ ప్రజలు భద్రపరుచుకున్నారని తెలిపారు. భారతదేశంలో కూడా సోషలిస్టు వ్యవస్థ కోసం సిపిఎం, కమ్యూనిస్టు పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్నారు. సోషలిస్టు వ్యవస్థ ఎంతైనా అవసరమని, దానికోసం ప్రజలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.జగన్నాధరావు, మీసాల సత్యం, గనిగంటి కోటేశ్వరరావు, బి.త్రినాధ్, వి.ఠాగూర్, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు